క్లుప్తంగా

మార్కెట్ చైర్మన్ ప్రశాంత్‌కు సన్మానం



మదనాపురం: మదనాపురం మార్కెట్ యార్డు చెర్మన్‌గా ఎన్నికైన పల్లెపాగు ప్రశాంత్‌ను ఆదివారం ఆయన స్వగృహంలో యువకులు పూలమాల శాలువాతో సన్మానించారు. రానున్న రోజుల్లో మరిన్ని పదవులు రావాలని కోరారు. కార్యక్రమంలో జనంపల్లి కిరణ్, కొమ్ము అమర్, కళ్యాణ్, అభి, శ్రావణ్, అభిలాష్, కిట్టు, దర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

మదనాపురం: మండలంలోని అజ్జకోలులో ఆదివారం బోయ పెద్దపెంటన్న, భార్య శంకరమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న మాజీ జెడ్పీటీసీ కృష్ణయ్య యాదవ్, మాజీ సర్పంచ్ విజయేందర్ రెడ్డి, వారి భౌతిక కాయంపై పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కుటుంబాల సభ్యులకు ఆర్థిక సాయం అందించారు. నాయకులు కరగడ్ల మల్లేష్, కరుణాకర్ రెడ్డి, బోయిని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నాయకుల పరామర్శ

గోపాల్‌పేట: మండలంలోని పొలికెపాడుకి చెందిన జనుంపల్లి గోపాల్‌రెడ్డి(83) రిటైర్డ్ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ గుండెపోటుతో మృతిచెందాడు. కొంతకాలంగా అనారోగ్యానికి గురయ్యాడు. రెండు రోజుల కిందట హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చేరాడు. ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుకు గురై మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి మృతుడి ఇంటికి చేరుకుని వారి కుటుంబ సభ్యులను పరామర్శించాడు. స్థానిక బీఆర్ఎస్ నాయకులు తిరుపతిరెడ్డి, బాల్‌రాజు, తిరుపతయ్య, రాజేష్‌గౌడ్, మన్యంనాయక్, తదితరులు వెంట ఉన్నారు.

పెబ్బేరులో వైద్యశిబిరం



పెబ్బేరు రూరల్: సంజీవని హాస్పెటల్ కర్నూల్ వారి ఆధ్వర్యంలో పెబ్బేరు పట్టణ కేంద్రంలోని నసీం ప్రథమ చికిత్స కేంద్రంలో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన 80 మంది రోగులకు ఆర్థో డాక్టర్ శ్రీనివాసులు వైద్య పరీక్షలు నిర్వహించారు. దీర్ఘకాలిక నొప్పులు ఉన్నవారిని పరీక్షించి వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేఎం బాషా, వైద్య బృందం పాల్గొన్నారు.

కుక్కల బెడద అరికట్టండి



అమరచింత: పట్టణంలో రోజురోజుకు ఊర కుక్కల బెడద తీవ్రతరం అవుతున్నా.. మున్సిపాలిటీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా వార్డుల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది పట్టణంలోని వీధి కుక్కలను పట్టుకెళ్తున్నట్లు మున్సిపాలిటీ అధికారులు కేవలం పదుల సంఖ్యలో కుక్కలను పట్టుకుని వెళ్లారే తప్పా.. పూర్తి స్థాయిలో వీటిని తరలించలేకపోయారని వాపోయారు. మటన్ మార్కెట్‌తో పాటు ఆరో, ఏడో, ఒకటో వార్డులతో పాటు ఎస్సీ కాలనీల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉందన్నారు. దీంతో చిన్నారులు కుక్కకాటుకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి వీధి కుక్కలను పట్టణం నుంచి తరలించాలని కోరుతున్నారు.

రూ.లక్షలు వెచ్చించారు.. వృథాగా వదిలేశారు



అమరచింత: డంపింగ్ యార్డ్‌కు చేరిన చెత్తలో ప్లాస్టిక్, ఇనుము, గాజు పదార్థాలను వేరు చేయడానికి వీలుగా ఏర్పాటు చేసిన సెగ్రిగేషన్ షెడ్ నిరుపయోగంగా మారింది. అమరచింత మున్సిపాలిటీ కేంద్రంలో సెగ్రిగేషన్ షెడ్ కోసం రూ.25 లక్షలు వెచ్చించి నిర్మించారు. ప్రస్తుతం డంపింగ్ యార్డును మస్తీపురం శివారుకు మారుస్తుండటంతో రూ.లక్షలతో నిర్మించిన షెడ్ మరుగున పడింది.

పనులకు పంపించొద్దు

పెద్దకొత్తపల్లి: మైనర్లను పనులకు పంపించొద్దని కోనేరు స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని లక్ష్మాపూర్‌లో బాలిక 5వ తరగతి వరకు చదివి బడి మానేసింది. ఆదివారం బాలిక తల్లిదండ్రులకు శ్రీనువాసులు చదువు ప్రాధాన్యాన్ని వివరించి బాలికను పాఠశాలకు పంపించేవిధంగా ఒప్పించారు.

పురం.. అంధకారం

- వనపర్తిలో 2వేల విద్యుత్ లెడ్ లైట్ల కొరత
- రెండేళ్లుగా సమకూర్చలేని దుస్థితి
- ఈఈఎస్ఎల్ ఏజెన్సీకి రూ.2.50 కోట్ల బకాయి ఉన్న మున్సిపాలిటీ
- బిల్లులు చెల్లించకపోవడంతో కొత్తవాటికి కలగని మోక్షం



వనపర్తిలోని గాంధీనగర్‌లో వీధి దీపాలు లేని స్తంభాలు

వనపర్తిటౌన్: వనపర్తి పురపాలికలోని పలు కాలనీలు అంధకారంలో మగ్గుతున్నాయి. విద్యుత్ స్తంభాలకు వీధి లైట్లు అమర్చకపోవడంతో వనపర్తి పట్టణంలోని కాలనీలు అంధకారంలో నెలకొంటున్నాయి. అసలే వర్షాకాలం కావడంతో చీకటి సమయాల్లో విష సర్పాల బారిన పడే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు చీకట్ల కారణంగా ఆరుబయటకు వెళ్లి కావాల్సిన వసతులు సమకూర్చుకోలేని పరిస్థితి నెలకొంది. సుమారు రెండేళ్ల కిందట వనపర్తి పట్టణంలో చాలా కాలనీల్లో వీధి దీపాలు లేవని, ఇందుకు 1,500 వీధి లైట్లు అవసరమని మున్సిపల్ అధికారులు ఈఈఎస్ఎల్ ఏజెన్సీకి ప్రతిపాదనలు పంపారు. ఇప్పటి వరకు ఒక్క లైటు రాలేదు.

అసలు కారణం ఇదీ..

పురపాలికలో విద్యుత్ బిల్లుల ఆదా కోసం లెడ్(ఎల్ఈడీ) లైట్లను అమర్చాలని ఈఈఎస్ఎల్ ఏజెన్సీతో 2017 అక్టోబర్ 10న ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో ఏడేళ్ల పాటు లెడ్ లైట్ల నిర్వహణ, కాలిపోయిన, ఫెయిల్ అయిన వాటి స్థానంలో కొత్త వాటిని అమర్చే బాధ్యత ఏజెన్సీకి సంబంధం ఉంటుంది. అయితే ఒప్పంద సమయంలో ఎంత అమౌంట్‌కు కుదుర్చుకున్నారనే వివరాలేవీ అధికారులు స్పష్టంగా చెప్పడం లేదు. కానీ ప్రతి నెల ఈఈఎస్ఎల్ ఏజెన్సీకి రూ.9 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని చెబుతున్నారు. గత అధికారుల వైఫల్యంతో సకాలంలో నగదు చెల్లింపు చేయకపోవడంతో ఇప్పటి వరకు ఈఈఎస్ఎల్ ఏజెన్సీకి రూ.2.50 కోట్ల బకాయిలు ఉన్నాయి. చెల్లించాల్సిన నగదును సకాలంలో చెల్లించకపోవడంతో కొత్త లైట్ల ప్రతిపాదనాలను సదరు ఏజెన్సీ పక్కన పెట్టినట్లు అధికారులు చెబుతున్నారు. భారీగా ఏజెన్సీకి పురపాలిక బకాయి పడటంతో కొత్త లైట్లు ఇచ్చేందుకు విముఖత వ్యక్తం చేస్తున్నారు. లెడ్ లైట్లకు ఒప్పందం కుదుర్చుకున్న ఏజెన్సీ గడువు 2024 అక్టోబర్ 10తో ముగియనుంది. వనపర్తిలో 18 వాట్స్ నుంచి 190 వాట్స్ వరకు లెడ్ లైట్లను దశల వారీగా 7,624 లైట్లను ఏర్పాటు చేశారు. ఇందులో 18 వాట్స్ 3,856, 35వాట్స్ 1,809, 70వాట్స్ 1,324, 110వాట్స్ 400, 190వాట్స్ 80 వరకు ఉన్నాయి.



మున్సిపల్ చైర్మన్ వార్డులో అంధకారం

లైట్లు లేవు..

పట్టణంలో కొత్త లైట్లు బిగించని మాట వాస్తవం. మేము రాకముందే గత అధికారులు 1,500 వీధి దీపాలకు ప్రతిపాదనాలు పంపారు. లెడ్ లైట్ల కోసం ఈఈఎస్ఎల్‌తో ఒప్పందం కుదుర్చుకున్న ఏజెన్సీకి బకాయిలు ఉండటంతో కొత్త లైట్లు ఇవ్వడం లేదు. ఐదు నెలల కిందట రూ.36 లక్షలు చెల్లించాం. గతంలో నిర్లక్ష్యం చూపడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ప్రభుత్వ గ్రాంట్లు రాగానే ఏజెన్సీకి బకాయిలు చెల్లించి సమస్య పరిష్కరిస్తాం.

– ఎం.పూర్ణచందర్, మున్సిపల్ కమిషనర్, వనపర్తి

భయమేస్తోంది..



మా కాలనీలో విద్యుత్ స్తంభాలు పాతి ఏడాదయ్యింది. ఇప్పటి వరకు వీధి దీపాలు అమర్చలేదు. రాత్రి పూట ఇంట్లో నుంచి బయటకు వస్తే భయమేస్తోంది. విషసర్పాలు గడ్డిలోంచి బయటకు వస్తున్నాయి. వీధి దీపాలు ఏర్పాటు చేస్తే మాలాంటి పేదలకు మేలు చేసినట్లు అవుతుంది.

– బచ్చన్న గాంధీనగర్ వనపర్తి

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి



కదుకుంట్లలో మొక్కలు నాటుతున్న స్నేక్ సొసైటీ అధ్యక్షుడు కృష్ణసాగర్

పెబ్బేరు రూరల్: గ్రామాల్లో ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని సాగర్ స్నేక్స్ సొసైటీ అధ్యక్షుడు కృష్ణసాగర్ కోరారు. ఆదివారం వనపర్తి మండలంలోని కదుకుంట్లలో నవ భారత్ యూత్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఆ కార్యక్రమంలో జిల్లా సాగర్ స్నేక్స్ సొసైటి సభ్యులు పాల్గొని మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ప్రజలకు పర్యావరణంపై అవగాహన కల్పించి, వారితో కలిసి పాఠశాలల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భూమి పొరల్లో ప్లాస్టిక్ కవర్లు అడ్డుకుంటాయని, దాంతో అడవుల్లోని మహా వృక్షాలు సైతం ఎండిపోవడం జరుగుతుందన్నారు. భూగోళం పైన వేడి తాపం రోజురోజుకు పెరుగుతుందని, వేడిని నియంత్రించాలంటే మొక్కలు నాటి భూమిని చల్లదనం చేయాలని అన్నారు. భావితరాల భవిష్యత్ దృష్టిలో ఉంచుకొని ప్రతి గ్రామంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం భాస్కర్, నవభారత్ యూత్ అధ్యక్షుడు విష్ణు, గోవర్ధన్, రవికిరణ్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇమామే మౌలాలి గంధోత్సవం



ఆత్మకూర్‌లో కొడిపీర్ల వద్ద ప్రార్థనలు చేస్తున్న చైర్‌పర్సన్ గాయత్రి, రవికుమార్ దంపతులు

ఆత్మకూర్: పట్టణంలోని రాజ వీధిలోని మసీదులో ఏర్పాటు చేసిన కొడిపీర్ల ఉత్సవాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఆదివారం రాత్రి, తెల్లవారుఝామున ఇమామే మౌలాలి గంధోత్సవాన్ని గౌస్‌సాహెబ్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేక పూజలు, కందూర్లు నిర్వహించి రాత్రి ఒంటి గంటకు పట్టణంలోని పురవీధుల వెంట భక్తిశ్రద్ధలతో పీర్లను ఊరేగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్ దంపతులు దట్టీలు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మహిళలు బొడ్డెమ్మలు వేశారు. అలాగే అలాయ్ బలాయ్ ఆడి భక్తిని చాటుకున్నారు. కొడిపీర్లను రాష్ట్ర కల్లుగీత కార్మిక విభాగం చైర్మన్, టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేషం నాగరాజుగౌడ్ దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు హసనేఆలం, హుసేనీఆలం, ఇమామే ఖాసీం, ఇమామే జలాలీ పీర్లను భక్తులు ప్రత్యేక పూజల అనంతరం ఊరేగింపు నిర్వహిస్తారు. ఊరేగింపును చూసేందుకు పట్టణంలోని ప్రజలతో పాటు ఇతర గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు.

ఇవేం రోడ్లు బాబోయ్!



కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని 7వ, 11వ, 12వ 8వ వార్డులకు వెళ్లే ప్రధాన రోడ్లపై ఫీట్ల లోతులోని గుంతలను చూసి వాహనదారులు భయపడుతున్నారు. చిన్నపాటి వర్షానికి కాలినడకన వెళ్లేవారు సైతం ఈ రోడ్డు వెంట ఇళ్లకు వెళ్లాలంటే తిప్పలు పడుతున్నారు. రోడ్డు బురదమయంగా ఉందని, నడిచేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పాలకులకు విన్నవించినా.. పట్టించుకునే వారు కరువయ్యారని ఆయా కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ దారిపై నిత్యం వందలాది మంది ప్రజలు రాకపోకలు కొనసాగిస్తుంటారు. ఇప్పటికై నా మున్సిపల్ పాలకవర్గం, అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని కోరుతున్నారు.



జోరందుకున్న వరినాట్లు

- బోరుబావుల కింద వారం రోజులుగా కరిగెట్లు చేస్తున్న రైతులు
- కేఎల్ఐ నీరు వస్తేనే చెరువుల కింద సాగు



పాన్‌గల్‌లో నాట్లు వేస్తున్న కూలీలు

పాన్‌గల్ / ఖిల్లాఘనపురం: ఖిల్లాఘనపురం మండలంలో వారం రోజులుగా కురుస్తున్న ముసురు వానతో బోరుబావుల కింద వరి నాట్లు ప్రారంభమయ్యాయి. ఈ సంవత్సరం ఆది నుంచి వానలు పెద్దగా కురవకపోవడంతో రైతులు బోరుబావుల కింద వరి నారు పోసుకుని వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు. అప్పుడప్పుడు కురుస్తున్న చిన్నపాటి వానలకు రైతులు మెట్ట పంటలు సాగు చేసుకున్నారు. ఇటీవల రోజు ముసురు వాన కురవడంతో కరిగెట్లు చేస్తూ.. వరినాట్లు ప్రారంభించారు.

550 ఎకరాల్లో సాగు..

పది రోజుల కిందటి వరకు బోరుబావుల్లో ఎక్కువగా నీరు ఉన్న రైతులు మాత్రమే వరి నాట్లు వేశారు. అప్పటి వరకు మండలంలో కేవలం 200 ఎకరాల్లోనే వరి సాగు చేయగా.. 10 రోజుల నుంచి రోజు వానలు కురుస్తుండటంతో రైతులు వరి సాగుకు మొగ్గు చూపుతున్నారు. ఈ పది రోజుల్లోనే 350 ఎకరాల్లో వరినాట్లు వేశారని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. మొత్తంగా ఇప్పటి వరకు మండలంలో మొత్తం 550 ఎకరాల్లో వరినాట్లు వేశారు.

కేఎల్ఐ నీరు వస్తేనే చెరువుల కింద సాగు..

పెద్ద వర్షాలు కురిసి చెరువులు, కుంటల్లోకి నీరు చేరితే గాని, కేఎల్ఐ సాగునీరు వస్తేనే సాగు చేస్తారని మండల రైతులు చెబుతున్నారు. గతేడాది వర్షాకాలంలో ఖిల్లాఘనపురం మండలంలో మొత్తం 4,800 ఎకరాల్లో వరి సాగు చేశారని వ్యవసాయ అధికారుల లెక్కలు చెబుతున్నాయి.

సన్నాలకే ప్రాధాన్యం

పాన్‌గల్ మండలంలో భీమా, కేఎల్ఐ కాల్వల ద్వారా సాగునీరు వస్తుందనే ఆశతో రైతులు వరి నార్లు పోసుకుంటున్నారు. దానికి తోడు కొన్ని రోజులుగా కురుస్తున్న ముసురు వర్షాలు పడుతుండటంతో బోర్లు, బావుల కింద వరినార్లు వేసుకున్న రైతులు నాటు వేస్తున్నారు.

సన్నాలపై ఆసక్తి...

ప్రభుత్వం సన్నాలకు బోనస్ ఇస్తామని ప్రకటించడం, రైతులు సన్నాల సాగుకే ముందుకు వస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికే 33 రకాల వరి వంగడాలను సన్నాలుగా గుర్తించింది. దీంతో రైతులు విరివిగా సన్నాలను సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

ఎకరాకు రూ.5 వేలు..

పాన్‌గల్‌లో నాట్లు వేసేందుకు శ్రీరంగాపూర్, కంచిరావుపల్లి గ్రామాల నుంచి కూలీలు పాన్‌గల్‌కు వస్తున్నారు. ఎకరాకు నాట్లు వేసేందుకు కూలీ రూ.5 వేలకు పైగా, కరిగెట చేసేందుకు ఎద్దుల గడెం కిరాయి రూ.3,100 వరకు ఉంటుందని రైతులు తెలిపారు. మండలంలోని 28 గ్రామపంచాయతీల్లో వానాకాలంలో 10,500 ఎకరాల్లో వరి సాగు చేస్తారని వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు.

కూలీ రేట్లు పెరిగాయి



వ్యవసాయ కూలీ రేట్లు విపరీతంగా పెరిగాయి. కూలీ రేట్లు చూస్తే భయంగా ఉంది. వరి నాట్లు వేసేందుకు ఎకరాకు రూ.5 వేలు, గడెం కిరాయి రూ.3 వేలు ఉండటంతో వ్యవసాయ భారంగా మారింది. నాట్లు వేసేందుకు కూలీలు దొరకక ఇతర ప్రాంతాల నుంచి కూలీలను తీసుకురావాల్సి వస్తుంది.

– గాలెన్న, రైతు, పాన్‌గల్

వర్షాలు కురుస్తుండటంతో..

మండలంలో ఇటీవల వర్షాలు కురుస్తుండటంతో రైతులు కిరిగెట్లు చేసి వరి సాగు చేస్తున్నారు. వారం రోజులుగా ముసురు వానలోనే కరిగెట్లు చేస్తూ.. నాట్లు వేస్తున్నారు. పెద్ద వర్షాలు, కేఎల్ఐ నీరు వదిలితే నెల రోజుల్లో గతేడాది అయిన సాగును చేరుకుంటారు.

– మల్లయ్య, వ్యవసాయ అధికారి, ఖిల్లాఘనపురం

పోడుభూముల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యానాయక్

పాన్‌గల్: జిల్లాలో గిరిజనులు ఎదుర్కొంటున్న పోడు భూముల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, గిరిజన కార్పొరేషన్ పెండింగ్ రుణాలు మంజూరు చేయాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యానాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని తెల్లరాళ్లపల్లితండాలో నిర్వహించిన గిరిజన సంఘం విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలో పోడు భూముల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. గిరిజనులు దాదాపు 1500 ఎకరాల పోడు భూములు సాగు చేసుకుంటున్నారని, ఇందులో కేవలం 250 ఎకరాలకు మాత్రమే పట్టాలు ఇచ్చారన్నారు. ముఖ్యంగా మండలంలో దాదాపు 200 ఎకరాలు గిరిజనులు పోడుభూములు సాగుచేసుకుంటున్నా.. అందులో ఒక్కరికి కూడా పట్టాలు ఇవ్వకపోవడం గిరిజనులపై వివక్ష చూపుతున్నారన్నారు. గిరిజన కార్పొరేషన్ ద్వారా 371 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి రెండు సంవత్సరాలు గడుస్తున్నా.. ఇప్పటికీ ఒక్కరికి కూడా రుణాలు మంజూరు కాలేదన్నారు. జిల్లాలో 40 తండాలను జీపీలుగా మార్చిన రెవెన్యూ జీపీలుగా గుర్తించలేదన్నారు. జిల్లాలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆగస్టు మొదటి వారంలో తండాలను సందర్శించి సమస్యలపై సర్వే నిర్వహించి ప్రభుత్వానికి నివేదిక ఇస్తామన్నారు. సమావేశంలో గిరిజన సంఘం నాయకులు బాబునాయక్, రవినాయక్, బాలునాయక్, సోమ్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటం



అజ్జకొల్లులో మాట్లాడుతున్న మండ్ల రాజు

మదనాపురం: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 30న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు చెప్పారు. ఆదివారం అజ్జకొల్లులో గ్రామపంచాయతీ కార్మికులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని, మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, పీఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని గ్రామపంచాయతీ కార్మికులకు ప్రత్యేక బడ్జెట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇల్లు లేని వారికి ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షలు ఇవ్వాలని ఈ నెల 30న చేపట్టనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్, కార్మికులు చిన్ననాగన్న, సహదేవుడు, లక్ష్మి పాల్గొన్నారు.

అవయవదాతల సంఘంలో జిల్లా వాసికి చోటు



సంఘం రాష్ట్ర నాయకులతో నియామక పత్రం అందుకుంటున్న ఆదామ్‌రాజ్

పాన్‌గల్: అఖిల భారత అవయవ దాతల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వనపర్తి జిల్లా పాన్‌గల్ మండల కేంద్రానికి చెందిన బొల్లి ఆదామ్‌రాజ్ నియమితులయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఉస్మానియా మెడికల్ కళాశాలల్లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు సీతామహాలక్ష్మి, సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు కాట్రగడ్డ భారతి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలో ఎందరో శరీర అవయవ దానం కోసం ఎదురుచూస్తున్న అభాగ్యులకు మానవ దృక్పథంతో తమవంతు సాయం చేసేందుకు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. అవయవ దాన ప్రాధాన్యత గురించి విస్తృత ప్రచారం నిర్వహించి, ప్రాణంపోయిన తర్వాత తమ అవయవాలను దానం చేసేలా ప్రచారం నిర్వహిస్తామన్నారు. తనపై ఎంతో నమ్మకంతో ఈ నియామకం చేసినందుకు సంఘం రాష్ట్ర నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మండల కేంద్రం వాసికి రాష్ట్ర స్థాయిలో పదవి రావడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

అటెన్షన్ ప్లీజ్





ఫొటో మోజు.. కారాదు ప్రమాదం

ప్రమాదమని తెలిసినా.. దిగువ ప్రాజెక్టు వద్ద సెల్ఫీల మోజు, ఫొటోలు దిగడం తగ్గడంలేదు. ఆదివారం సెలవు రోజు కావడంతో ఉదయం తొమ్మిది గంటల లోపే సందర్శకులు ప్రాజెక్టు దిగువ భాగంలోకి అడుగు పెట్టారు. నీటి ప్రవాహం అత్యధికంగా ఉన్న ప్రాజెక్టు దిగువ భాగంలోని పుష్కర ఘాట్ వద్దకు పర్యాటకులు, యువకులు, చిన్నారులు పోలీసులు ఏర్పాటు చేసిన ముళ్లకంచెలను దాటి నదీ అంచుకు వెళ్తున్నారు. సెల్ఫీలు దిగటం, చేపల కోసం గాలాలు వేయడం, చిన్నారులు సైతం నీటి ప్రవాహం వద్దకు వెళ్తున్న సంఘటలు కనిపించాయి.

– అమరచింత

విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించాలి



శిక్షణలో పాల్గొన్న ఆచార్యులు, మాతాజీలతో అధ్యక్షులు

ఖిల్లాఘనపురం: విద్యార్థులకు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, దేశభక్తి, దైవభక్తి, కథలు సవివరంగా అర్థమయ్యేలా బోధించాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు రాచాల జనార్దన్, గాండ్ల రాములు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్‌లో బాలసంస్కార్ కేంద్రాల నిర్వాహకుల శిక్షణ కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పుతూనే వారిలో దేశభక్తిని పెంపొందించాలన్నారు. సత్ప్రవర్తన కలిగిన విద్యార్థులను తయారుచేసి రాబోయే తరానికి ఆదర్శంగా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో మానాజీపేట, పర్వతాపురం గ్రామానికి చెందిన ఆచార్యులు, మాతాజీలు, శిక్షకులు రాజేశ్వరి, రామేశ్వరి, పుష్పమ్మ తదితరులు పాల్గొన్నారు.

చేయూత ఇవ్వాలి

తాడూరు: ప్రత్యేక తెలంగాణ సాధనలో ప్రముఖ పాత్ర వహించిన విశ్వబ్రాహ్మణులను ప్రభుత్వం పరంగా చేయూతనివ్వాలని విశ్వబ్రాహ్మణ సంఘం మండల నాయకులు భాస్కరాచారి, కృష్ణమాచారి, అనంతరాములు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని చెన్నకేశవ ఆలయ ఆవరణలో నిర్వహించిన మండల విశ్వబ్రాహ్మణుల సమావేశంలో మాట్లాడారు. ఆయా బ్యాంకుల ద్వార రుణాలు అందజేయాలలన్నారు.

